


జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




| శనివారం 16 మే 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 348 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|

# రక్షణ రంగంలో రాయలసీమకు భారీ ఊపు..

## ఆంధ్రప్రదేశ్‌లో అత్యాధునిక యుద్ధ విమాన కార్యక్రమానికి శ్రీకారం






సందేశం టైమ్స్, అమరావతి, మే 16, ప్రతినిధి: రాయలసీమ రక్షణ రంగంలో దేశానికి అగ్రగామిగా నిలిచే దిశగా వేగంగా ముందుకు సాగుతోందని, భారత రక్షణ సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే కీలక అడుగుగా ఆంధ్రప్రదేశ్‌లో రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలోని వైమానిక అభివృద్ధి సంస్థ ఏర్పాటు చేస్తున్న అత్యాధునిక మధ్యస్థ యుద్ధ విమాన కార్యక్రమం సదుపాయాన్ని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభించగా, ఈ కార్యక్రమంలో పాల్గొనడం గౌరవంగా భావిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ అత్యాధునిక రక్షణ సాంకేతిక రంగాల్లో స్వయం సమృద్ధి సాధించే దిశగా దూసుకెళ్తోందని, ఈ యుద్ధ విమాన కార్యక్రమం ద్వారా గోప్య రక్షణ వ్యవస్థలు, ఆధునిక వైమానిక సాంకేతికత, సమగ్ర యుద్ధ విమాన సామర్థ్యాల్లో దేశీయ నైపుణ్యం మరింత పెరగనుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రాంతవ్యాప్తంగా పలు కీలక రక్షణ ప్రాజెక్టులకు శంకుస్థాపనలు నిర్వహించడంతో పాటు రక్షణ, వైమానిక రంగాలకు చెందిన సంస్థలతో తొమ్మిది అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నామని, దీని ద్వారా ఆంధ్రప్రదేశ్ వ్యూహాత్మక తయారీ, సాంకేతిక ఆవిష్కరణల ప్రధాన కేంద్రంగా ఎదగనుందని వెల్లడించారు.

# 151 నుంచి 11కు.. ప్రజా తీర్పుతో ప్రత్యర్థులకు గట్టి షాక్ ఇచ్చిన పవన్ కళ్యాణ్



సందేశం టైమ్స్, అమరావతి, మే 16, ప్రతినిధి: గత ఎన్నికల్లో 151 స్థానాలతో అధికారంలోకి వచ్చిన పార్టీని ఈసారి కేవలం 11 స్థానాలకు పరిమితం చేస్తూ ప్రజలు సంచలన తీర్పు ఇచ్చారని, అధికార అహంకారంతో వ్యవహరించిన నాయకత్వానికి ప్రజాస్వామ్యంలో ప్రజలే అసలైన తీర్పుదారులని రాజకీయ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ నాయకత్వంలో కూటమి ఘన విజయాన్ని సాధించడంతో పాటు జనసేన పోటీ చేసిన 21 స్థానాల్లో 21 చోట్ల విజయం సాధించి శాతం వంద విజయ రేటుతో చరిత్ర సృష్టించిందని అభిమానులు పేర్కొంటున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లోనే కాకుండా జాతీయ రాజకీయాల్లో కూడా కీలక పాత్ర పోషించే స్థాయికి పవన్ కళ్యాణ్ ఎదిగారని, దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్వయంగా ఆయన నివాసానికి రావడం ఆయనకు పెరిగిన రాజకీయ ప్రాధాన్యతకు నిదర్శనమని చెబుతున్నారు. ఒకప్పుడు ఓటమిని ఎగతాళి చేసినవారే ఇప్పుడు ఆయన విజయాన్ని చూసి ఆశ్చర్యపోతున్నారని, పవన్ కళ్యాణ్ రాజకీయ ప్రస్థానం యువతకు స్ఫూర్తిగా మారిందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు.

# నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ కేసులో ప్రధాన నిందితుడు అరెస్ట్.. దేశవ్యాప్తంగా కలకలం



సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, మే 16, ప్రతినిధి: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన వైద్య ప్రవేశ అర్హత పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజీ కేసులో ప్రధాన సూత్రధారి పీవీ కులకర్ణిని కేంద్ర దర్యాప్తు సంస్థ అధికారులు అరెస్ట్ చేశారు. శుక్రవారం పుణేలో ఆయనను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. పీవీ కులకర్ణి రసాయన శాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తూ, జాతీయ పరీక్ష సంస్థ తరఫున ప్రశ్నాపత్రాల రూపకల్పన బృందంలో సభ్యుడిగా ఉన్నట్లు సమాచారం. మే 3న నిర్వహించిన వైద్య ప్రవేశ పరీక్ష ప్రశ్నాపత్రాన్ని ముందుగానే లీక్ చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆయన, ప్రైవేట్ బోధన తరగతుల సమయంలోనే ప్రశ్నాపత్రాన్ని బయటకు చేరవేసినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలినట్లు తెలుస్తోంది. ఈ కేసులో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని, లీకేజీ వ్యవహారంలో ఇతరుల ప్రమేయంపై కూడా కేంద్ర దర్యాప్తు సంస్థ విచారణ కొనసాగిస్తోందని అధికారులు తెలిపారు.




# తెలంగాణ అభివృద్ధికి దీర్ఘకాల ప్రణాళికలు.. భవిష్యత్ లక్ష్యాలతో ప్రభుత్వం ముందుకు : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 16, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని, ఈ క్రమంలో ఎక్కడైనా పొరపాట్లు జరిగినా వాటిని సరిదిద్దుకుంటూ లక్ష్యాలను చేరుకునేందుకు ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. వే2న్యూస్ సంస్థ నిర్వహించిన "రానున్న పదేళ్లలో తెలంగాణ ఎలా ఉండబోతోంది" అనే అంశంపై జరిగిన సమావేశంలో పాల్గొన్న ఆయన రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాలు, రాజకీయాలు, భవిష్యత్ ప్రణాళికలపై సూటిగా తన అభిప్రాయాలను వెల్లడించారు. సంక్షేమం నిరంతర ప్రక్రియ కాగా అభివృద్ధి దీర్ఘకాలిక ప్రణాళికలతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని, 2047 నాటికి తెలంగాణను ప్రపంచ స్థాయి రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో తెలంగాణ రైజింగ్ విజన్ పత్రాన్ని రూపొందించినట్లు తెలిపారు. ప్రజాప్రతినిధిగా తన ఆలోచనల్లో స్పష్టత ఉందని, ప్రతి ఒక్కరినీ మెప్పించడం సాధ్యం కాదని, 60 నుంచి 75 శాతం మంది ప్రజలు ప్రభుత్వ నిర్ణయాలను ఆమోదిస్తే అదే విజయమని పేర్కొన్నారు. సమస్యలు వచ్చినప్పుడు లక్ష్యాన్ని గుర్తుచేసుకుని ముందుకు సాగాలని, జీవితంలో ఆలోచనల స్పష్టత చాలా ముఖ్యమని అన్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని, ఎస్సీ ఉపవర్గీకరణ, బీసీ కులగణన, తెలంగాణ గీతానికి రాష్ట్ర గీత హోదా, అమరవీరుల కుటుంబాలకు గౌరవం వంటి అంశాలను ఉదాహరణగా చెప్పారు. తుమ్మడిహెట్టి, పాలమూరు – రంగారెడ్డి వంటి ప్రాజెక్టులను పూర్తి చేయడానికి కట్టుబడి ఉన్నామని వెల్లడించారు. నగర అభివృద్ధిలో భాగంగా మూసీ పునరుజ్జీవనం, నాలాల ఆక్రమణల తొలగింపు, కాలుష్య పరిశ్రమలను నగర పరిధి బయటకు తరలించడం వంటి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. భవిష్యత్ తరాల కోసం సంస్కరణలు అవసరమని, విమర్శలు వచ్చినా లక్ష్యం సరైనదైతే వాటిని భరిస్తానని స్పష్టం చేశారు. ప్రతిష్ఠాత్మక భవిష్యత్ నగర నిర్మాణం కోసం రహదారులు, మెట్రో, విమానాశ్రయం, నౌకాశ్రయ అనుసంధానంతో మౌలిక వసతులు కల్పిస్తే భారీ పెట్టుబడులు వస్తాయని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం ద్వారా వారి కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గిందని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల మధ్య చదువు మానివేతలు తగ్గినట్లు నీతి ఆయోగ్ వెల్లడించిన విషయాన్ని గుర్తుచేశారు. రాజకీయాల్లో ప్రజల మెజారిటీ మద్దతు సాధించడమే విజయానికి అసలు ప్రమాణమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపుకు ప్రత్యేక కమిటీ.. సేవలు, త్యాగాలకు గౌరవం కల్పించనున్న ప్రభుత్వం

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 16, ప్రతినిధి: తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను గుర్తించి వారి సేవలు, త్యాగాలను గౌరవించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు సాధారణ పరిపాలన శాఖ జీవో ఆర్టీ సంఖ్య 679 జారీ చేసింది. తెలంగాణ ఉద్యమంలో కొందరు ప్రాణత్యాగం చేయగా, మరికొందరు శారీరక వైకల్యానికి గురయ్యారని, పలువురిపై కేసులు నమోదై జైలు జీవితం గడిపిన నేపథ్యంలో వారి సేవలను అధికారికంగా గుర్తించాలనే డిమాండ్‌కు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ కమిటీకి ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె. కేశవరావు అధ్యక్షుడిగా వ్యవహరించనుండగా, సభ్యులుగా మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ఎమ్మెల్సీ మరియు ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డి నియమితులయ్యారు. సాధారణ పరిపాలన శాఖ రాజకీయ కార్యదర్శి కమిటీ కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించేందుకు ముందుగా స్పష్టమైన ప్రమాణాలను రూపొందించడం, ఆ ప్రమాణాల ఆధారంగా ఉద్యమకారుల జాబితాను సిద్ధం చేయడం, అనంతరం వారికి కల్పించాల్సిన గుర్తింపు, గౌరవం, సౌకర్యాలపై ప్రభుత్వానికి సిఫారసులు చేయడం కమిటీ ప్రధాన బాధ్యతగా పేర్కొన్నారు. అవసరమైతే అధికారులు, ఇతర వ్యక్తులను పిలిపించి సమాచారం సేకరించడంతో పాటు సమావేశాలు నిర్వహించే అధికారం కమిటీకి ఉంటుందని, వీలైనంత త్వరగా నివేదిక సమర్పించాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. అన్ని శాఖల అధికారులు కమిటీకి అవసరమైన సహకారం అందించాలని ప్రభుత్వం ఆదేశించింది.

# క్యాన్సర్ నియంత్రణకు 'తెలంగాణ క్యాన్సర్ అట్లాస్' కీలకం.. ప్రత్యేక వైద్య కేంద్రాల ఏర్పాటుకు చర్యలు : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 16, ప్రతినిధి: తెలంగాణలో క్యాన్సర్ అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి వాటి కారణాలను విశ్లేషించేందుకు "తెలంగాణ క్యాన్సర్ అట్లాస్" ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో క్యాన్సర్ వ్యాధి పరిస్థితులపై ప్రభుత్వ సలహాదారు, ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు రూపొందించిన సమగ్ర నివేదికను జూబ్లీహిల్స్‌లోని నివాసంలో ముఖ్యమంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. క్యాన్సర్ వ్యాధిపై సమగ్ర నివేదిక రూపొందించిన డాక్టర్ నోరి దత్తాత్రేయుడిని ముఖ్యమంత్రి అభినందించారు. ఈ నివేదికలోని సమాచారంతో క్యాన్సర్ అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, వ్యాధికి కారణాలను విశ్లేషించడంతో పాటు ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. హైదరాబాద్‌కే పరిమితం కాకుండా క్యాన్సర్ బాధితులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో కూడా ప్రత్యేక ఆస్పత్రులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. క్యాన్సర్ చికిత్సకు ఆరోగ్యశ్రీ పథకం కింద కార్పొరేట్ ఆస్పత్రుల్లో మరింత మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.




## ప్రతి కాలనీకి స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం : ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి


సందేశం టైమ్స్, పటాన్చెరు, మే 16, బి డేవిడ్: సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గంలోని బీరంగూడ డివిజన్ పరిధిలోని కిష్టారెడ్డిపేట లేక్ వ్యూ కాలనీలో రక్షిత మంచినీటి సరఫరా కార్యక్రమాన్ని పటాన్చెరు శాసన సభ్యుడు గూడెం మహిపాల్ రెడ్డి శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కాలనీకి స్వచ్ఛమైన తాగునీటిని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మంచినీటి సరఫరాను మరింత మెరుగుపరచేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ మండల పరిషత్ అధ్యక్షుడు దేవానందం, మాజీ జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యుడు సుధాకర్ రెడ్డి, మాజీ ఉప మండల పరిషత్ అధ్యక్షుడు సత్యనారాయణ, గ్రామ మాజీ సర్పంచ్ కృష్ణ, జలమండలి ప్రధాన అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఉప ప్రధాన అధికారి శివ, విభాగ అధికారి వెంకటరమణ, కాలనీ అధ్యక్షుడు విజయ్ తదితరులు పాల్గొన్నారు.



## 18 ఏళ్ల తర్వాత కలుసుకోనున్న జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

సందేశం టైమ్స్, న్యాల్కల్, మే 16, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2007-2008 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు 18 ఏళ్ల తర్వాత మరోసారి కలుసుకోనున్నారు. “మైత్రి మిలన్” పేరుతో నిర్వహిస్తున్న ఈ ఆత్మీయ పూర్వ విద్యార్థుల సమ్మేళనం మే 17న న్యాల్కల్‌లోని శ్రీ కృష్ణ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరగనుంది. చిన్ననాటి స్నేహాలు, పాఠశాల జ్ఞాపకాలు, గురువుల బోధనలు, సరదా సంఘటనలను మరోసారి గుర్తు చేసుకుంటూ పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. చదువు పూర్తై ఉద్యోగాలు, వ్యాపారాలు, కుటుంబ బాధ్యతలతో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన స్నేహితులు దాదాపు రెండు దశాబ్దాల తర్వాత ఒకేచోట కలుసుకోవడం ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఈ సందర్భంగా పూర్వ ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు కోసం గురువులు నిరంతరం కృషి చేస్తారని తెలిపారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులతో పాటు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను జీవితాంతం గౌరవించాలని సూచించారు. విద్యార్థులు విజయాలు సాధిస్తే గురువులకు గర్వంగా ఉంటుందని, సమస్యలు ఎదురైతే ముందుగా బాధపడేది కూడా గురువులేనని పేర్కొన్నారు. ఈ సమ్మేళనంలో ప్రధాన ఉపాధ్యాయులు రాజప్ప, పద్మయ్య, లాలయ్య, అనంత్ రెడ్డి, మీనా, కవిత, గౌతం, శ్రీనివాస్, తుకారాం, పద్మవతి, నరసింహారెడ్డి తదితర ఉపాధ్యాయులతో పాటు పూర్వ విద్యార్థులు పాల్గొననున్నారు. హైదరాబాద్, సంగారెడ్డి, జహీరాబాద్, బీదర్ తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో హాజరుకానుండటంతో న్యాల్కల్‌లో పూర్వ విద్యార్థుల కలయికకు ప్రత్యేక సందడి నెలకొంది.

## శని అమావాస్య సందర్భంగా ఘనంగా శ్రీ శనీశ్వర జయంతి మహోత్సవాలు



సందేశం టైమ్స్, వట్పల్లి, మే 16, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం సర్వేశ్వరాపురం దుద్యాలలోని శ్రీగిరి శేషాద్రిన హరిహర మహాక్షేత్రం శని ఘాట్ దేవాలయంలో శని అమావాస్య సందర్భంగా శనివారం శ్రీ శనీశ్వర జయంతి మహోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు దేవాలయ అర్చకులు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం శనీశ్వరుడికి విశేష తిల తైలాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. శని దోష నివారణకు ఇది అత్యంత పవిత్రమైన సమయమని, ముఖ్యంగా అష్టమ శని, అర్ధాష్టమ శని ప్రభావాలతో బాధపడుతున్న భక్తులు దర్శించుకుని శనీశ్వరుని అనుగ్రహం పొందాలని సూచించారు. మేష, సింహ, ధనస్సు, కుంభ, మీన రాశుల వారికి ఈ రోజు విశేష ఫలప్రదమని పేర్కొన్నారు. మహోత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని శ్రీశ్రీశ్రీ సర్వేశ్వర అంబిక శివయోగి స్వామీజీ, సర్వేశ్వర భక్తబృందం, అర్చకులు ఆహ్వానించారు. మరిన్ని వివరాలకు 9618951629ను సంప్రదించాలని తెలిపారు.

## ఫామ్ ఆయిల్ సాగుతో రైతులకు అధిక లాభాలు.. అవగాహన సదస్సులో నిపుణుల సూచనలు





సందేశం టైమ్స్, అందోల్ నియోజకవర్గం, మే 16, ప్రతినిధి: జోగిపేట పట్టణంలోని డాకూరి వెంకటేశం వ్యవసాయ క్షేత్రంలో శుక్రవారం నిర్వహించిన ఫామ్ ఆయిల్ రైతుల అవగాహన సదస్సులో వ్యవసాయ నిపుణులు రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డాక్టర్ సాంబశివరావు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో విదేశీ దిగుమతులపై ఆధారపడకుండా స్వదేశీ ఉత్పత్తులను పెంచడం ద్వారా దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందించవచ్చన్నారు. తెలంగాణలోని సారవంతమైన భూముల్లో ఫామ్ ఆయిల్ సాగు చేపడితే రైతులకు అధిక ఆదాయం లభిస్తుందని, మొక్కలు నాటిన రెండేళ్ల తర్వాత దిగుబడి ప్రారంభమవుతుందని తెలిపారు. ఫామ్ ఆయిల్ తోటల్లో అంతర పంటలు సాగు చేయడం ద్వారా రైతులు మరింత ఆదాయం పొందవచ్చని సూచించారు. రైతు సంఘం నాయకుడు డాకూరి వెంకటేశం మాట్లాడుతూ ఫామ్ ఆయిల్ సాగు రైతులకు అధిక లాభాలను అందిస్తుందని, రైతులు దీనిపై దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జోగిపేట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాకూరి వెంకటేశం, సహకార సంఘం చైర్మన్ నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సారా శివకుమార్, ముప్పారం రాములు, శాస్త్రవేత్తలు డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ కాశిరావు, ప్రాంతీయ నిర్వాహకుడు ఈశ్వర్ రెడ్డి, రైతులు కడల రాములు, కిరణ్, బండిమీద శ్రీనివాస్, పిరగారి వెంకటేశం, పిట్ల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



## కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ యువ నాయకుడు శివసాయి జన్మదిన వేడుకలు ఘనంగా

సందేశం టైమ్స్, వట్పల్లి, మే 16, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండల పరిధిలోని పోతులబోగుడ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యువ నాయకుడు శివసాయి జన్మదిన వేడుకలు హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించబడ్డాయి. తన అభిమాన నాయకుడు, మాజీ మంత్రి కేటీ రామారావు సమక్షంలో పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి శివసాయిని శాలువాతో సన్మానించి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ సర్పంచ్ ముద్దామురం రాజు సూచన మేరకు తన అభిమాన నాయకుల సమక్షంలో పుట్టినరోజు జరుపుకోవాలని భావించిన శివసాయి హైదరాబాద్‌కు వెళ్లి వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముద్దామురం రాజు, గ్రామ అధ్యక్షుడు కోశిగె శేఖర్, పాఠశాల నిర్వహణ కమిటీ మాజీ చైర్మన్ మాడె వీరన్న, పి. ఉదయభాను, పి. శివకుమార్, బీపీ రాజశేఖర్, బస్వరాజ్, పి. సందీప్ రావు, జంబిగె రాజు, ఎం. వీరన్న తదితరులు పాల్గొని శివసాయికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## మిషన్ మోడ్‌లో ధాన్యం దిగుమతులు వేగవంతం చేయాలి.. మిల్లర్ల నిర్లక్ష్యాన్ని సహించం : జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, మే 16, ప్రతినిధి: జిల్లాలో కొనుగోలు చేసిన వరి ధాన్యం దిగుమతి ప్రక్రియను మిషన్ మోడ్‌లో వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయం నుంచి అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ విక్రాంత్ సింగ్, ఆర్డీవోలు, పౌరసరఫరాలు, సహకార, తహసీల్దార్లు, మండల అభివృద్ధి అధికారులు, పోలీసు, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో నిర్వహించిన గూగుల్ సమావేశంలో ఆమె ధాన్యం కొనుగోలు, దిగుమతులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేస్తోందన్నారు. రైతులకు తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తూ నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి కేటాయించిన రైస్ మిల్లులు, గోదాములకు తరలిస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యాన్ని బట్టి రవాణా శాఖ అధికారులు సరిపడా లారీలను సమకూర్చాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని, దిగుమతుల విషయంలో రైస్ మిల్లర్లు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం, రవాణా, గన్నీ సంచుల సరఫరా, హమాలీల ఏర్పాటు వంటి అంశాల్లో అలక్ష్యం ఉండకూడదన్నారు. రైస్ మిల్లులు, గోదాములకు చేరిన ధాన్యాన్ని వేగంగా దిగుమతి చేసుకోవాలని, అవసరమైతే హమాలీల సంఖ్యను పెంచుకోవాలని సూచించారు. రోజుకు కనీసం పది నుంచి పదిహేను లారీల ధాన్యాన్ని దిగుమతి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి నిత్యానంద్, పౌరసరఫరాల విభాగాధికారి జగదీష్, గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



## చిలిప్‌చెడ్ మండలంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్న ఆవుల రాజిరెడ్డి

సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, మే 16, ప్రతినిధి: నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి శుక్రవారం చిలిప్‌చెడ్ మండలంలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో 140 మంది గర్భిణీ స్త్రీలకు "మాతృదేవోభవ" పోషకాహార కిట్లను పంపిణీ చేసి వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. గర్భిణీలు పౌష్టికాహారం తీసుకుంటేనే తల్లి, శిశువు ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. అనంతరం మండలానికి చెందిన ఆరుగురు లబ్ధిదారులకు మొత్తం రూ.2 లక్షల 45 వేల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. తరువాత చిలిప్‌చెడ్ మండలం రామ్‌దాస్‌గూడలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అలాగే తూప్రాన్ ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో మాసాయిపేట్ గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు నీటి కాలువలో పడి మృతి చెందిన ఘటనపై వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## జిల్లాలో ప్రశాంతంగా కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియ : కలెక్టర్ ప్రతిమా సింగ్

సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, మే 16, ప్రతినిధి: మెదక్ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. పౌరసరఫరాలు, రెవెన్యూ, పోలీస్, సహకార, గ్రామీణాభివృద్ధి శాఖల సమన్వయంతో క్షేత్రస్థాయిలో కొనుగోలు కేంద్రాలను పటిష్టంగా పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 29 వేల 670 మంది రైతుల నుంచి లక్షా 32 వేల 992.760 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి 14 వేల 966 మంది రైతుల ఖాతాల్లో రూ.171 కోట్ల 91 లక్షలను జమ చేసినట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తూ పారదర్శకంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ కొనసాగిస్తున్నామని కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు.




## ఆదాయ వనరుల పెంపుపై స్థానిక సంస్థలు దృష్టి సారించాలి : రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య

సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 15, ప్రతినిధి: స్థానికంగా అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకుంటూ ఆదాయ వనరులను పెంపొందించుకునే దిశగా స్థానిక సంస్థలు చిత్తశుద్ధితో కృషి చేయాలని రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య సూచించారు. సూర్యాపేట సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో తూర్పు తెలంగాణా ప్రాంతీయ స్థానిక సంస్థల సదస్సు శుక్రవారం నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనవసర వ్యయాన్ని తగ్గించుకుని ఆదాయ వనరుల ద్వారా రాబడిని పెంచుకున్నప్పుడే స్థానిక సంస్థల ద్వారా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించి జీవన ప్రమాణాలను మెరుగుపర్చవచ్చని అన్నారు. గ్రామ స్వరాజ్యమే దేశ స్వరాజ్యమని గుర్తుచేస్తూ గ్రామీణ ప్రాంత ప్రజలను పాలనలో భాగస్వాములను చేస్తూ సామాజిక, ఆర్థిక అభివృద్ధికి స్థానిక సంస్థలు కృషి చేయాలని హితవు పలికారు. జిల్లాలోని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు ఆదాయ వనరులను అభివృద్ధి చేసుకోవాలని, పన్ను వసూళ్లు, ప్రకటనల ఆదాయం, వృత్తి పన్ను, వ్యాపార వాణిజ్య రుసుములు వంటి మార్గాలను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ గ్రామాలు, మున్సిపాలిటీలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా యంత్రాంగం పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సదస్సులో పలు జిల్లాల ప్రజాప్రతినిధులు, మేయర్లు, చైర్‌పర్సన్లు, అధికారులు పాల్గొన్నారు.



## శేరిపల్లి గ్రామంలో జనగణన సర్వే పరిశీలించిన జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య

సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, మే 16, ప్రతినిధి: మెదక్ జిల్లా టేక్మాల్ మండలంలోని శేరిపల్లి గ్రామంలో మొదటి విడత జనగణన సర్వే కార్యక్రమాన్ని జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య పరిశీలించారు. గ్రామంలో ఎన్యూమరేటర్లు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. చాకలి చంద్రయ్య, లలిత కుటుంబాల సర్వేలో స్వయంగా పాల్గొని వివరాలు నమోదు ప్రక్రియను పరిశీలించారు. ప్రతి ఇంటిని, ప్రతి కుటుంబాన్ని తప్పనిసరిగా సక్రమంగా సర్వే చేయాలని ఆయన సూచించారు. జనగణన యాప్ వినియోగంలో లేదా సర్వర్ సమస్యలు ఎదురైతే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎన్యూమరేటర్లు శ్రీవిద్య, టేక్మాల్ ఇన్‌చార్జి ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ దేవప్రసాద్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి మహేష్ రెడ్డి, రవీందర్ రెడ్డి, ఫీల్డ్ అధికారి మంగలి మోహన్ తదితరులు పాల్గొన్నారు.



## వేగవంతంగా ధాన్యం సేకరణ చేపట్టాలి : జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 15, ప్రతినిధి: ధాన్యం సేకరణ ప్రక్రియలో క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న అడ్డంకులను అధిగమిస్తూ ప్రత్యేక కార్యాచరణతో వేగవంతంగా ముందుకు సాగుతున్నామని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. శుక్రవారం ఆయన ఆత్మకూరు (ఎస్), నూతనకల్ మండల కేంద్రాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను, స్థానిక రైస్ మిల్లులను సందర్శించి కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో ప్రధానంగా ఎదురవుతున్న లారీల కొరత, హమాలీల ఇబ్బందులు, అన్‌లోడింగ్ సమస్యలను గుర్తించినట్లు తెలిపారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు రవాణా శాఖ, పోలీస్ శాఖల సమన్వయంతో లారీల కొరత లేకుండా అన్ని వాహనాలను ధాన్యం సేకరణకు మళ్లిస్తున్నామని చెప్పారు. రైస్ మిల్లుల వద్ద అన్‌లోడింగ్ ఆలస్యం కాకుండా ప్రతి మిల్లుకు ప్రత్యేక ఇన్‌చార్జిని నియమించామని, అదనపు హమాలీలను ఏర్పాటు చేసి అన్‌లోడింగ్ వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. మండల స్థాయిలో సమస్యల పరిష్కారానికి మండల ప్రొక్యూర్మెంట్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రెవెన్యూ, సివిల్ సప్లై, పోలీస్ శాఖలు సమన్వయంతో ధాన్యం సేకరణను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక కోఆర్డినేటర్లు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారని చెప్పారు. అకాల వర్షాల నేపథ్యంలో ప్రత్యేక అలర్ట్ మెకానిజం సిద్ధం చేసినట్లు వెల్లడిస్తూ, వర్షాల వల్ల ధాన్యం తడిస్తే వెంటనే గుర్తించి బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకుంటామని రైతులకు భరోసా ఇచ్చారు. ఈ పర్యటనలో తహసీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తయ్యే వరకు క్షేత్రస్థాయిలోనే ఉండాలి : జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, మే 16, ప్రతినిధి: జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తయ్యే వరకు అధికారులు క్షేత్రస్థాయిలోనే ఉండాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. ప్రతి కొనుగోలు కేంద్రాన్ని స్వయంగా సందర్శించి పర్యవేక్షణ చేయాలని, కొనుగోలు మరియు రవాణా ప్రక్రియలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వెల్దుర్తి మండల కేంద్రంలోని ఫ్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తూప్రాన్ ఆర్డీవో జైచంద్రారెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొనుగోలు ప్రక్రియలో జాప్యానికి తావు లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని, రవాణా సమస్యలు తలెత్తితే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో తార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, సరిపడా లారీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కచ్చితమైన రికార్డులు నిర్వహిస్తూ వివరాలను నమోదు చేయాలని పేర్కొన్నారు. రైతుల సహకారంతో తాలు, రాళ్లు, మట్టి లేని నాణ్యమైన ధాన్యాన్ని మిల్లులకు పంపించాలని తెలిపారు. ప్యాడీ క్లీనింగ్ పరికరాలు అందుబాటులో లేకపోతే వెంటనే ఇతర కేంద్రాల నుంచి తెప్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కొనుగోలు కేంద్ర నిర్వాహకులు పాల్గొన్నారు.

## లో వోల్టేజ్ సమస్యతో ఖమ్మం జిల్లా ప్రధాన ఆసుపత్రిలో వైద్య సేవలకు తీవ్ర అంతరాయం



సందేశం టైమ్స్, ఖమ్మం, మే 16, ప్రతినిధి: ఖమ్మం జిల్లా ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రిలో లో వోల్టేజ్ సమస్య కారణంగా వైద్య సేవలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయి. ఆసుపత్రికి సరిపడా ట్రాన్స్‌ఫార్మర్లు లేకపోవడంతో ఐసీయూ, ఆపరేషన్ థియేటర్లు, బాలింతల విభాగాల్లో ఏసీలు, కీలక వైద్య పరికరాలు సక్రమంగా పనిచేయడం లేదని సిబ్బంది తెలిపారు. 240 వోల్ట్స్ రావాల్సిన చోట కేవలం 180 నుండి 200 వోల్ట్స్ మాత్రమే సరఫరా అవుతుండటంతో పరికరాలు తరచుగా దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. ఏసీలు పనిచేయకపోవడంతో ఆపరేషన్ థియేటర్, ఐసీయూ విభాగాల్లో దుర్వాసన వస్తోందని, రోగులు మరియు వైద్యులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. అత్యవసర వైద్య పరికరాలు కూడా సరిగా పనిచేయకపోవడంతో సరైన చికిత్స అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వైద్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎండాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతుండటంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యుత్ సరఫరా కల్పించాలని సిబ్బంది, వైద్యులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

## మొక్కజొన్న చేనులో అగ్నిప్రమాదం.. తక్షణమే స్పందించి మంటలు అదుపు చేసిన సర్పంచ్



సందేశం టైమ్స్, చింతకాని, మే 16, ప్రతినిధి: చింతకాని మండల పరిధిలోని బస్వాపురం గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు మొక్కజొన్న చేనుకు నిప్పు పెట్టడంతో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. సమాచారం అందిన వెంటనే గ్రామ సర్పంచ్ ఆవుల నరసింహారావు స్వయంగా రంగంలోకి దిగి గ్రామపంచాయతీ ట్రాక్టర్ సహాయంతో మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. పరిస్థితి తీవ్రతను గమనించిన ఆయన వెంటనే అగ్నిమాపక శాఖను సమాచారం ఇవ్వగా, ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనలో 63 కెవీ ట్రాన్స్‌ఫార్మర్ పూర్తిగా కాలిపోయినట్లు అధికారులు తెలిపారు. గ్రామానికి మరింత ప్రమాదం జరగకుండా సకాలంలో చర్యలు తీసుకోవడంతో పెద్ద నష్టం తప్పిందని గ్రామస్థులు తెలిపారు. సహాయ కార్యక్రమాల్లో గ్రామ కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.

## గణపవరం గ్రామంలో యువకుడి హత్య కలకలం.. పోలీసులు దర్యాప్తు ప్రారంభం





సందేశం టైమ్స్, కోదాడ, మే 16, ప్రతినిధి: సూర్యాపేట జిల్లా కోదాడ మండలం గణపవరం గ్రామంలో యువకుడి హత్య ఘటన తీవ్ర కలకలం రేపింది. గ్రామానికి చెందిన గణేష్ అనే యువకుడు బెంగళూరులో చదువు పూర్తిచేసి ఉద్యోగం చేస్తూ సెలవుల నిమిత్తం మూడు రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చినట్లు సమాచారం. ఈ క్రమంలో రాత్రి సుమారు ఎనిమిది గంటల సమయంలో స్నేహితుడి వివాహ వేడుకకు వెళ్లిన అతడు అనంతరం కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు ఆందోళనకు గురై పోలీసులకు ఫిర్యాదు చేశారు. తరువాత లక్ష్మీపురం గ్రామ రహదారి సమీపంలోని మామిడి తోటలో గణేష్ మృతదేహం గుర్తించినట్లు గ్రామస్థులు తెలిపారు. శరీరంపై కత్తి గాయాలు ఉండటం, తీవ్రంగా హింసించి హత్య చేసినట్లు ప్రాథమికంగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీం, పోలీస్ డాగ్స్ సహాయంతో దర్యాప్తు కొనసాగుతోంది. హత్యకు కారణాలు, నిందితుల గుర్తింపుపై పోలీసులు విచారణ చేపట్టగా, కుటుంబ సభ్యులు నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతున్నారు.

## హెన్లీ పాస్‌పోర్ట్ సూచీ 2026లో భారత్‌కు 78వ స్థానం

సందేశం టైమ్స్, అంతర్జాతీయం, మే 16, 2026: హెన్లీ పాస్‌పోర్ట్ సూచీ 2026 తాజా ర్యాంకింగ్స్ విడుదలయ్యాయి. అంతర్జాతీయ విమాన రవాణా సంఘం అందించే డేటా ఆధారంగా ప్రతి దేశ పాస్‌పోర్ట్ బలం ఎంతమంది దేశాలకు ముందస్తు వీసా లేకుండా ప్రయాణించవచ్చో ఆధారంగా ఈ సూచీ రూపొందించబడుతుంది. తాజా నివేదిక ప్రకారం భారత్ 78వ స్థానాన్ని పొందింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో భారత్ 75వ స్థానంలో ఉండగా, తాజా అప్‌డేట్‌లో మూడు స్థానాలు దిగజారి 78వ స్థానానికి చేరుకుంది. జాబితాలో మొదటి స్థానాన్ని సింగపూర్ సాధించింది. సింగపూర్ పాస్‌పోర్ట్ ద్వారా 195 దేశాలకు వీసా లేకుండా ప్రయాణించే అవకాశం ఉన్నట్లు నివేదిక పేర్కొంది. చివరి స్థానాల్లో అఫ్గానిస్థాన్ నిలిచింది. ఈ ర్యాంకింగ్స్ ద్వారా ప్రపంచ దేశాల మధ్య ప్రయాణ స్వేచ్ఛలో ఉన్న తేడాలు మరోసారి స్పష్టమయ్యాయని నిపుణులు పేర్కొన్నారు.



## సంగారెడ్డి ఫల పరిశోధన కేంద్రం డైమండ్ జూబిలీ వేడుకలు.. మామిడి మేళా ప్రారంభం

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 16, ప్రతినిధి: సంగారెడ్డి ఫల పరిశోధన స్థానం డైమండ్ జూబిలీ వేడుకలతో పాటు మామిడి వైవిధ్య ప్రదర్శన మేళా శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమైంది. ఈ కార్యక్రమం మే 16, 17 తేదీల్లో రెండు రోజులపాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మామిడి ప్రేమికులు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరై విభిన్న రకాల మామిడి పండ్ల ప్రదర్శనను వీక్షించాలని పిలుపునిచ్చారు. ఈ మేళాలో రైతులు శాస్త్రవేత్తలతో ప్రత్యక్షంగా మాట్లాడే అవకాశం కల్పించడంతో పాటు మామిడి సాగులో ఆధునిక సాంకేతికతలు, కొత్త ఆవిష్కరణలపై అవగాహన పొందనున్నారు. రైతులు తమ వద్ద ఉన్న ప్రత్యేకమైన లేదా కొత్త మామిడి రకాలను ప్రదర్శించడంతో పాటు మామిడి ఆధారిత ప్రాసెస్డ్ ఉత్పత్తులను కూడా ప్రదర్శించవచ్చని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రవేశం పూర్తిగా ఉచితమని పేర్కొంటూ అందరూ హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## ఫుడ్ ప్రాసెసింగ్ హబ్‌గా తెలంగాణ రూపుదిద్దుకుంటోంది : మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 16, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రం ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో దేశంలోనే ప్రముఖ హబ్‌గా రూపుదిద్దుకుంటోందని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం తొగారపల్లి గ్రామ శివారులో కే జె ఎస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్–2కు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహాతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. రూ.650 కోట్ల పెట్టుబడితో 44 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా సుమారు 1500 మందికి, పరోక్షంగా దాదాపు 5 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని తెలిపారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రమల స్థాపన ద్వారా స్థానిక యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యమని అన్నారు. జహీరాబాద్ కేంద్రంగా నిమ్జ్‌ను అతిపెద్ద పారిశ్రామిక కారిడార్‌గా అభివృద్ధి చేస్తున్నామని, భవిష్యత్తులో ఈ ప్రాంతం అంతర్జాతీయ స్థాయి పరిశ్రమల కేంద్రంగా మారుతుందని తెలిపారు. వ్యవసాయ ఆధారిత రాష్ట్రంగా ఉన్న తెలంగాణలో వరి, పాలు, పండ్లు, కూరగాయలు, పసుపు వంటి ఉత్పత్తులకు విలువ జోడించే ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు రైతులకు, యువతకు ఎంతో మేలు చేస్తాయని పేర్కొన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహా మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయడం ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




## తమిళనాడులో మద్యం అమ్మకాలపై కొత్త నిబంధనలు.. వయస్సు పరిమితి 21 ఏళ్లకు పెంపు

సందేశం టైమ్స్, అంతర్జాతీయం, మే 16, ప్రతినిధి: తమిళనాడు ప్రభుత్వం మద్యం అమ్మకాలపై కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై మద్యం కొనుగోలుకు కనీస వయస్సు 21 సంవత్సరాలుగా నిర్ణయించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటివరకు అమలులో ఉన్న 18 సంవత్సరాల వయస్సు పరిమితిని పెంచుతూ కొత్త విధానం అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. మద్యం విక్రయాల సమయంలో ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ లేదా ఓటర్ ఐడీ వంటి గుర్తింపు పత్రాలు తప్పనిసరిగా చూపించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అనుమానం ఉన్న సందర్భాల్లో వయస్సు ధృవీకరణ పత్రాలు చూపించిన తరువాతే మద్యం విక్రయించాల్సి ఉంటుందని ఆదేశాలు జారీ చేశారు. అలాగే వైన్ షాపులు, బార్లు, పబ్స్ వద్ద 21 ఏళ్లలోపు వారికి ప్రవేశం లేదా విక్రయం ఉండదని స్పష్టంగా బోర్డులు ప్రదర్శించాలని ప్రభుత్వం సూచించింది. గుళ్లు, పాఠశాలలు, బస్టాండ్ల సమీపంలోని మద్యం దుకాణాలపై కూడా కఠిన చర్యలు తీసుకుంటూ ఇప్పటికే 717 షాపులను మూసివేసినట్లు సమాచారం. ఈ నిర్ణయంతో మద్యం వినియోగంపై నియంత్రణ పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు.

## స్త్రీనిధి సంస్థలో అక్రమాలపై చర్యలు తీసుకోవాలి : కల్వకుంట్ల కవిత

సందేశం టైమ్స్, తెలంగాణ బ్యూరో, మే 16, ప్రతినిధి: మహిళల ఆర్థిక సాధికారతకు తోడ్పాటునివ్వాల్సిన స్త్రీనిధి సంస్థలో అక్రమాలు జరుగుతున్నాయని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఎక్స్ వేదికగా ప్రకటన విడుదల చేసిన ఆమె, సంస్థలో రిటైర్ అయ్యి 14 ఏళ్లు అయినప్పటికీ ఒక అధికారి ఇంకా సంస్థపై ఆధిపత్యం కొనసాగిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఎక్స్ అఫీషియో చైర్మన్ పదవిని దక్కించుకోవడానికి పక్కా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారని ఆరోపించారు. ఈ నెల 23తో సంస్థ ఎండీగా పదవీకాలం ముగుస్తున్నప్పటికీ దొడ్డిదారిలో కీలక పోస్టుల్లో కొనసాగేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ పెద్దల అండతో సంస్థలో అక్రమాలు కొనసాగుతున్నాయని, ఈ విషయంలో మంత్రి సీతక్క తక్షణమే స్పందించాలని ఆమె డిమాండ్ చేశారు. స్త్రీనిధి సంస్థ ఎండీపై చర్యలు తీసుకోవాలని, ఉద్యోగ నియామకాలు పూర్తిగా పారదర్శకంగా జరిగేలా ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కల్వకుంట్ల కవిత కోరారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.